ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

ఆదివారం 5 మే 2024

గురుకుల కళాశాలలో సమస్యల తిష్ట 8లో..

శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు కరువు 8లో..



హోరెత్తుతున్న ప్రచారం

- నియోజకవర్గంలో అభ్యర్థుల సుడిగాలి పర్యటనలు
- సీఎం రేవంత్‌రెడ్డి సభ, కేసీఆర్ రోడ్ షోతో జోష్
- నేడు పెద్దపల్లిలో జేపీ నడ్డా సభ
- ప్రచారానికి వారంరోజులే గడువు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండడంతో నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం హోరెత్తుతున్నది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి మున్నెన్నడూ లేనివిధంగా 42 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్, బీజేపీ నుంచి గోమాసే శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. ఒకరిపైనొకరు పైచేయి సాధించేందుకు నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. ఈనెల 3న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరఫున సీఎం రేవంత్‌రెడ్డి ధర్మపురి నియోజకవర్గం పరిధిలోని రాజారాంపల్లిలో జన జాతర సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తిపాక రిజర్వాయర్, పాలకుర్తి లిఫ్ట్‌ఇరిగేషన్ చేపడుతామని, రామగుండంలో బీ థర్మల్‌లో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు, నేతకాని కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని, నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఏ సమస్యనైనా తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తానని మాట ఇచ్చారు. అదేరోజు గోదావరిఖనిలో, శనివారం మంచిర్యాలలో రోడ్‌షో నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సింగరేణి సంస్థను తామే కాపాడామని, తాగు, సాగునీరు తీసుకవచ్చామని, అనేక సంక్షేమ పథకాలను అమలుచేశామని, కేంద్రంలో బీజేపీ చేసిందేమీ లేదని, కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి హామీ ఇచ్చిన పథకాలను అమలుచేయడం లేదని విమర్శించారు. బీజేపీ కాంగ్రెస్ ఓటు వేయవద్దని, ప్రశ్నించే గొంతు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కే ఓటువేయాలని పిలుపునిచ్చారు.

● పని ప్రదేశాల వద్దకే అభ్యర్థులు..

బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ తరఫున ప్రచారం నిర్వహించేందుకు ఈనెల 5న జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పెద్దపల్లికి వస్తున్నారు. జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యూహ, ప్రతివ్యూహాలతో అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ ప్రభుత్వాలు చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ వస్తున్నారు. ఎండలు మండుతున్నా కూడా వాటిని లెక్క చేయకుండా అభ్యర్థులు ఉదయం 6గంటలకే ఇళ్ల నుంచి బయటకు వచ్చి ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో ఉదయమే పెద్దఎత్తున మహిళలు ఉపాధిహామీ పనులకు వెళుతుండడంతో పని చేస్తున్న ప్రదేశాల వద్దకే అభ్యర్థులు వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. పట్టణాల్లో షాపుల వెంబడి తిరగడంతో పాటు రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. ఒకరిపైనొకరు ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. 42మంది అభ్యర్థులు పోటీ పడుతుండడంతో ఒక్కో పోలింగ్ బూతులో మూడు ఈవీఎంలను ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థులు నమూనా బ్యాలెట్‌లు చూపి ప్రచారం చేస్తున్నారు. అలాగే ప్రధాన పార్టీలు గాకుండా ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్రులు పోటీ పడుతున్నప్పటికీ, పెద్దగా ప్రచారం నిర్వహించడం లేదు. ఈనెల 13వ తేదీన ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరగనున్నది. పోలింగ్‌కు 48 గంటలలోపు అంటే 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. మూడు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నప్పటికీ, ఓటర్లు మాత్రం గుంభనంగా వ్యవహరిస్తున్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్



ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లిటౌన్, మే 4: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేయాలని, ఎటువంటి అవకతవకలు, అక్రమాలకు పాల్పడవద్దని అదనప కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను తప్పకుండా పాటించాలని నాణ్యమైన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మద్దతు ధరపై రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైస్‌మిల్లర్లు ఎటువంటి కోతలు లేకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, కొనుగోలు కేంద్రం సెంటర్ ఇన్‌చార్జీలు, సీవోలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిటౌన్, మే 4: హజ్ యాత్రికులకు జిల్లా కేంద్రంలో వ్యాక్సినేషన్ వేసినట్లు అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. శనివారం అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ జిల్లా ఆసుపత్రిలో తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యాక్సినేషన్ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కొరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోనే డయాగ్నస్టిక్ హబ్ వద్ద ప్రత్యేక వాక్సినేషన్ శిబిరం ఏర్పాటు చేశామని, హజ్ యాత్రికులు వ్యాక్సినేషన్ కోసం హైదరాబాద్ వెళ్లకుండా మన జిల్లా కేంద్రంలోనే వ్యాక్సిన్ వేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రత్యేక వ్యాక్సినేషన్ శిబిరంలో మొత్తం 22 మందికి క్వాడ్రివాలెంట్ మెనింగోకోకల్ మెనిన్ జైటీస్ వ్యాక్సిన్ సీజనల్ ఇన్ ఫ్లూఎంజా వ్యాక్సిన్, ఓరల్ పోలియో వ్యాక్సిన్ లు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్, డి.సి.హెచ్.ఎస్ డాక్టర్ రమాకాంత్, జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శౌరయ్య, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పి. కృపాబాయి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో

పెద్దపల్లిటౌన్, మే 4:రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్డీవో గంగయ్య సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై శనివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి సుభాష్ చౌరస్తా, అమర్‌నగర్, మజీద్‌చౌరస్తా మీదుగా జెండా వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించామని, ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగం కల్పించిన ఆయుధం ఓటు హక్కు అని తమ యొక్క ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో పెద్దపల్లి జిల్లా అత్యధిక పోలింగ్ శాతం నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ కుమార్, ఎస్సై మల్లేశం, మున్సిపల్ ఏఈ సతీష్, మెప్మా ఆర్పీలు, ఓటీలు, మున్సిపల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నుంచి ఓటు సేకరణ ప్రక్రియ పరిశీలన

- సహాయ రిటర్నింగ్ అధికారి గంగయ్య



ఇంటి నుంచి ఓటు వేసే ప్రక్రియను ప్రారంభిస్తున్న ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లిటౌన్, మే 4: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధి పెద్దపల్లి పట్టణంలోని పోలింగ్ కేంద్రం నంబరు 54, ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న ఇంటినుంచి ఓటు సేకరించే ప్రక్రియను సహాయ రిటర్నింగ్ అధికారి బి. గంగయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ, దివ్యాంగులకు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు భారత ఎన్నికల కమిషన్ ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వేసే అవకాశం కల్పించిందన్నారు. పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించు కునేందుకు దరఖాస్తు చేసుకున్న వారి కోసం ప్రత్యేకంగా 12 ఎన్నికల బృందాలను ఏర్పాటు చేసి ఓటర్ల ఇంటి నుంచి ఓటు హక్కును సేకరిస్తున్నామన్నారు. హోం ఓటింగ్ పోలింగ్ కార్యక్రమం చేపట్టి, 12 బృందాలకు సంబంధించిన సెక్టార్ అధికారులను వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పాటు చేసి నిరంతరం సమాచారం తెలుసుకుంటూ, సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నామని వివరించారు. ఇంటివద్ద ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఓటరు గోప్యత పాటించే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటి నుంచి ఓటు స్వీకరించే షెడ్యూల్ వివరాలు పోటి చేసే అభ్యర్థులకు అందించామని, వారి ఏజెంట్‌లు సైతం బృందాలతో ఓటరు ఇంటి వద్దకు వెళ్ళవచ్చన్నారు. ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగం ప్రక్రియను పరిశీలించిన సహాయ రిటర్నింగ్ అధికారి, ఓటు ఎవరికి వేస్తున్నామనే విషయం ఎవరికి చెప్పాల్సిన అవసరం లేదని, పోలింగ్ నిర్వహణకు వచ్చిన అధికారులకు, మన కుటుంబ సభ్యులకు కూడా చెప్పాల్సిన అవసరం లేదని, మనకు నచ్చిన వారికి మనం ఓటు వేసుకోవచ్చని, ఎవరి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటరుకు సూచించారు.పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం బ్యాలెట్ పత్రాలతో ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, పోలీసు అధికారి, వీడియో మెన్‌లతో బృందంగా వెళ్ళి ఓటర్ల నుంచి ఓటు స్వీకరిస్తున్నామన్నారు. ఇంటివద్ద నుంచి ఓటు హక్కు స్వీకరించే ప్రక్రియను పూర్తి స్థాయిలో వీడియో రికార్డింగ్ చేస్తున్నామన్నారు.

హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్డీవో, ఏఆర్‌వో హనుమా నాయక్

మంథని, మే 4: పార్లమెంట్ ఎన్నికల్లో మంథని నియోజకవర్గంలో 1245 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వానా నమోదు చేసుకోగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ ఓటింగ్ సెంటర్‌లో 32 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా, 86 మంది హోం ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు మంథని ఆర్డీవో, ఏఆర్‌వో హనుమా నాయక్ తెలిపారు. ఓటరు ఫెసిలిటేషన్, పోస్టల్ ఓటింగ్ సెంటర్లను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సెన్షియల్ సర్వీస్ ఓటర్లు ఐదుగురికి ముగ్గురు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓట్లు వినియోగించుకున్నట్లు తెలిపారు. హోంఓటింగ్ కోసం 93 మంది దరఖాస్తు చేసుకోగా 5టీంల ద్వారా 86మంది ఓట్లు సేకరించినట్లు తెలిపారు. ఆదివారం కూడా సెంటర్లు పనిచేస్తాయని పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకోవ్చని తెలిపారు.

గోదారమ్మకు కేసీఆర్ పూజలు



గోదావరికి పూజలు చేస్తున్న కేసీఆర్

గోదావరిఖని, మే 4: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం సాయంత్రం గోదావరిఖనిలో గోదారమ్మకు పూజలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం గోదావరిఖనిలో రోడ్‌షో నిర్వహించిన అనంతరం సింగరేణి ఇల్లందు క్లబ్‌లో కేసీఆర్ బస చేశారు. శనివారం సాయంత్రం 4గంటల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో వారితో కేసీఆర్ సెల్ఫీలు, ఫోటోలు దిగారు. అనంతరం మంచిర్యాల రోడ్‌షోకు బయలుదేరిన కేసీఆర్ గోదావరి బ్రిడ్జిపై ఆగి గోదారమ్మకు పూజలు చేశారు. గోదావరి బ్రిడ్జిపై ఆగి పూలు, వస్త్రాలు, డబ్బులు గోదావరిలో వేసి నమస్కారం చేశారు. గోదావరి బ్రిడ్జిపై పలువురు మహిళలు కేసీఆర్‌కు హారతులతో స్వాగతం పలికారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించొద్దు

-ఎలిగేడు మండల సమావేశంలో ఎంపీపీ తానిపర్తి స్రవంతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్రవంతి

ఎలిగేడు, మే 4 : ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్‌రావు అన్నారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్నట్లు తెలిసిందని, వాటి నివారణలో భాగస్వాములు కావాలని ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని చేపట్టిన అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలో పేరుకుపోయిన సమస్యలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం మొదలుకాక ముందే ఎస్టిమేట్ ప్రకారం పూర్తిచేయాలని, అందుకు ఇంజనీరింగ్ అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించి చేసిన అభివృద్ధి పనులు పదికాలాలపాటు ఉండే విధంగా పర్యవేక్షణ చేయాలని ఆమె సూచించారు. ఉపాధిహామీ కూలీలకు పనికి తగ్గ వేతనం అందించాలని పనిలో వారికి ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని అధిక వేడి ఉన్నందున సరైన ఏర్పాట్లు పూర్తిచేయాలని కోరారు. ప్రస్తుత విద్య సంవత్సరంలో పదవ తరగతిలో వివిధ ర్యాంక్‌లు సాధించిన విజయం పొందిన విద్యార్థులకు ఆమె ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అందుకు కృషిచేసిన ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్‌ల పరిస్థితిపై సమీక్షించారు. వేసవిలో చిన్నపిల్లలకు సరైన వసతుల కల్పనకు కృషిచేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితిలు సరైన ఏర్పాట్లు చేసి తూకం విషయంలో అశ్రద్ధ వహించవద్దని తెలిపారు. ఎస్సారెస్పీ కాలువల మరమ్మత్తులు చేపట్టి వచ్చే వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో విరివిగా దొరుకుతున్న గుడుంబా మహమ్మారిని అరికట్టాలని, బెల్ట్‌షాపుల మూసివేతకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఎంపీటీసీలు కొత్తిరెడ్డి ప్రేమలత, తూడి లక్ష్మీ, సావిత్రమ్మ, ఏఈలు సంపత్‌రెడ్డి, యశశ్రీ, అహ్మద్‌అలీ. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకళ, ఎక్సైజ్ శాఖ ఎస్సై సరిత, ఏపీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యవాదులను గెలిపించాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యుడు జేవీ చలపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న జేవీ చలపతిరావు

కళ్యాణ్‌నగర్, మే 4: ప్రజల కోసం ప్రజా ఉద్యమంలో ఉండే ప్రజాస్వామ్యవాదులను గెలిపించి ఆర్ఎస్ఎస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జేవీ చలపతిరావు అన్నారు. శనివారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికలు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో జరుగుతున్నాయని, ఈ ఎన్నికలు దేశ భవిష్యత్‌ను మన భావి జీవితాలను నిర్ణయించేవి అని, కేంద్రంలో పదేళ్ళ అధికారంలో ఉన్న బీజేపీ వివిధ రాష్ట్రాల హక్కులపై దాడులు చేశాయని, కార్మికులు, రైతాంగం, దళితులు, ప్రతిపక్షాలు, ముస్లీం మైనార్టీలపై దాడులు కొనసాగించాయని చెప్పారు. హిందుత్వం పేరిట హిందు మత రాజ్యంగా దేశ రాజ్యాంగాన్ని మార్చాలని ప్రచారం సాగిస్తుందన్నారు. కులం, మతం, భాషల పేరిట ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి చీలికలు సృష్టిస్తున్నాయని, సీబీఐ, ఈడీ, ఐటీ విభాగాలను వినియోగించి ప్రతిపక్షాలపై దాడులు చేస్తూ ముఖ్యమంత్రులను సైతం అక్రమంగా అరెస్టు చేస్తూ జైల్లో నిర్బంధిస్తున్నారని, చివరికి మీడియా యాజమాన్యం కూడా గుత్తాధిపత్యం చేస్తున్నారని ఆరోపించారు. 2024ఎన్నికల్లో గెలుపొందడానికి బీజేపీ తీవ్ర ప్రయత్నం చేస్తుందని, దీనిని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కే రాజన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఐ కృష్ణ, ఈదునూరి నరేష్, వెంకన్న, అశోక్, చిలుక శంకర్, మల్లేష్, చంద్రయ్య, దుర్గయ్య, పద్మ, రాజన్న, అబెడ్నెగో, సుధాకర్, తిరుపతి పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి స్థలం లీజు

- మూడేళ్లయినా నిర్మించని కార్పొరేషన్
- ఏడాదికి లక్ష రూపాయల చొప్పున చెల్లించాలంటూ సింగరేణి డిమాండ్ నోటీసు



పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కోసం సింగరేణి లీజుకు ఇచ్చిన స్థలం

కోల్‌సిటీ, మే 4 : రామగుండం నగరపాలక సంస్థ పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ అవసరాలకు సింగరేణి సంస్థ మూడేళ్ల క్రితం మున్సిపల్ జంక్షన్‌లో స్థలాన్ని లీజుకు ఇచ్చింది. ప్రజా అవసరాల మేరకు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని, వీటిని కూడా ఆగస్టు 2020లోపే పూర్తిచేయాలని ప్రభుత్వం జీవో ఆర్‌టీ 231 తేది: 08-06-2020న గైడ్‌లైన్స్ జారీ చేసింది. ఈ జీవోలో ప్రజల అవసరాలకు అనుగుణంగా షీ టాయిలెట్స్, ఇతర టాయిలెట్స్ నిర్మాణం జరపాలని పేర్కొన్నది. వీటికి సంబంధించి కలెక్టర్ ఆధ్వర్యంలో ఏజెన్సీలను అప్పగించి పనులు చేయించాలని, ఇందుకు ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, స్థానిక సంస్థల ఎస్‌సీలతో కమిటీ వేసి ఎస్ఎస్ఆర్‌లు నిర్ణయించాలని జీవోలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అప్పటికే తయారైన డిజైన్లను కూడా కలెక్టర్లకు పంపారు. ఒకవేళ కమర్షియల్ ఏరియాలైతే పీపీపీ మోడ్‌లో ఇచ్చే అవకాశాలను కూడా పరిశీలించాలని పేర్కొన్నది. ఇప్పటికే సింగరేణి సంస్థ రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పలు సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలకు స్థలాలను ఇచ్చింది. ఈసారి మాత్రం కార్పొరేషన్ విజ్ఞప్తి మేరకు లీజుకు ఇచ్చింది. ఇందుకోసం ఏడాదికి లక్ష రూపాయలు చెల్లించాలని నిర్ణయించారు. 2021లో ఈ స్థలాన్ని సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి నగరపాలక సంస్థకు అప్పగించారు. ఈ మూడేళ్లలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం జరపలేదు. రాజీవ్ రహదారి పక్కనే ఈ స్థలాన్ని సింగరేణి కేటాయించింది. ఇందులో మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. మూడేళ్ల కాలపరిమితికి రూ.3లక్షలు లీజు ఫీజు చెల్లించాలంటూ సింగరేణి సంస్థ నగరపాలక సంస్థకు డిమాండ్ నోటీసు పంపించడం గమనార్హం.

తనిఖీల్లో 10,88,600 నగదు పట్టివేత



హుజూరాబాద్‌లో సీజ్ చేసిన నగదు

హుజూరాబాద్, మే 4: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద శనివారం ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళుతున్న 10,88,600 నగదును సీజ్ చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. ఎస్ఎస్‌టీ, సీఐఎస్ఎఫ్, పోలీస్ సిబ్బంది చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో వేర్వేరు వాహనాల్లో వచ్చిన 9మంది వ్యక్తుల వద్ద ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 10,88,600 నగదును సీజ్ చేశామన్నారు. సీఐ బొల్లం రమేశ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎవరైనా రూ. 50వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లకూడదని చెప్పారు. ఒకవేళ తీసుకెళ్లిన తగిన ఆధారాలు ఉండాలని తెలిపారు. ఆధారాలు లేకుంటే సీజ్ చేస్తామని తెలిపారు.

వడదెబ్బతో నలుగురి మృతి



వనమాల(ఫైల్)

చొప్పదండి, మే 4: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శనివారం వడదెబ్బతో నలుగురు మృతి చెందారు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బత్తుల భూమయ్య (55) సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపా రు. సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అధికారులు, ప్రజాప్రతిని ధులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

● హుజూరాబాద్‌రూరల్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన బొల్లబోయిన వనమాల(45) అనే మహిళా కూలీ శనివారం వడదెబ్బతో మృతి చెందింది. వనమాల ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వెళ్లింది. సాయంత్రం వేళ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న 108 సిబ్బంది వనమాలను పరీక్షించగా అప్పటికే మృతి చెందిందని తెలిపారు. వనమాల భర్త శ్రీనివాస్ హమాలీ కార్మికుడుగా పని చేస్తున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

● బీర్‌పూర్: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని మంగెళ గ్రామంలోని గోండు గూడేనికి చెందిన కొమురం సోము (58)అనే గిరిజన రైతు వడదెబ్బ తగిలి శని వారం మృతి చెందాడు. సోము ఉదయం నువ్వు పంట కోసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి అలసటగా ఉందని పడుకున్నాడు. కాసేపటికి సోము భార్య వచ్చి నిద్ర లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ చుంచు శారద నరేందర్, గోండు గూడెం ప్రజలు, గ్రామస్థులు కోరుతున్నారు.



భూమయ్య, సోము(ఫైల్)

● జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన ఎండీ, రాయపోశు (71) అనే వృద్ధుడు శనివారం వడదెబ్బ తాకి మృతి చెందాడు. రాయపోశు గ్రామంలో పని నిమిత్తం బయటికి వెళ్లి ఇంటికి చేరుకున్నాడు. కాసేపటికి అస్వస్థతకు గురై మృతి చెందాడు.

వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కేసు

జమ్మికుంట, మే 4: ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీతో ఓ యువతిని వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై శనివారం పోలీస్‌లు కేసు నమోదు చేశారు. జమ్మికుంటకు చెందిన యువతి ఇంటర్మీడియట్ చదువుకున్న సమయంలో హనుమకొండకు చెందిన సుమంత్ అనే వ్యక్తి క్లాస్‌మెట్‌గా ఉన్నాడు. దీన్ని ఆసరాగా తీసుకున్న సుమంత్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి యువతి అన్నయ్యకు మేసేజ్‌లు పంపిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. బాధితురాలి పిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసు

హుజూరాబాద్, మే 4: హుజూరాబాద్‌లో బెల్ట్‌షాపులు నిర్వహించిన వారిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ శనివారం తెలిపారు. ఉషకోయిల విష్ణువర్ధన్, ఆకుల తిరుపతి, కొక్కుల సత్యనారాయణలు గతంలో బెల్ట్‌షాపులు నిర్వహించగా వారిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసి హెచ్చరిం చామని తెలిపారు. పద్ధతి మార్చుకోకుండా బెల్ట్ షాపులు నిర్వహించినందుకు వారిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ విజయ్‌కుమార్ వద్ద బైండోవర్ చేసి, రూ. 80వేల జరిమానా విధించినట్లు వివరించారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

- ఫెయిల్ అయితే నిందించొద్దు
- కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్, మే 4: విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించినప్పుడే వారు ముందుకెళ్తారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. పట్టణం లోని మైనార్టీ పాఠశాలలో శనివారం పదో తరగతి ఫెయిల్ అయిన విద్యా ర్థులు, వారి తల్లిదం డ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో ఫెయిల్ అయ్యామని చదవడం మానేస్తే అక్కడే ఆగిపోతారన్నారు. చిన్న ఉద్యోగానికైనా పదో తరగతి సర్టిఫికెట్ అవసరమన్నారు. విద్యార్థులు ఫెయిల్ అయ్యారని తిట్టకుండా వారిని ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులు ఇతర పిల్లలను పోల్చుతూ ఫెయిల్ అయిన విద్యార్థులను అవమానించవద్దని సూచించారు. నాలు గేళ్లుగా చదువు మానేసిన 95మందిలో 72మంది మళ్లీ పరీక్షలు రాసి పాస్ అయ్యారని తెలిపారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈ వో జనార్దన్‌రావు, నర్సింహస్వామి, ఆర్డీవో రమేశ్‌బాబు, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంఈవో నర్సింహారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

బీసీల రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలి

గణేశ్‌నగర్, మే 4: బీసీల రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శ్రీధర్ రాజు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 7నహైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన మందిరంలో రాష్ట్ర స్థాయి బీసీ సదస్సు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జాతీయస్థాయిలో బీసీ కుల గణన జరగాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు రిజర్వేషన్ కల్పించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని, పార్లమెంట్ ఎన్నికలలో బీసీల మద్దతు విషయంపై చర్చ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి బీసీ సదస్సుకు యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమస్యలపై చర్చించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఎదుర్కోలు వేడుక

కరీంనగర్ కల్చరల్, మే 4: నగరంలోని గాంధీరోడ్ వైశ్యభవన్‌లో ఆదివారం వైశ్యసేవా కేంద్రం ఆధ్వర్యంలో వల్లీ దేవసేనాసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి గాంధీరోడ్ రామాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వల్లీ దేవసేన మాతలకు ఎదుర్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పురాణం మహేశ్వరశర్మ, సేవాకేంద్రం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిదుర సురేశ్, పెద్ది విద్యాసాగర్, ఆర్థిక కార్యదర్శి ముస్త్యాల రమేశ్, డైరెక్టర్లు ఎలుగందుల మునీందర్, పోకల లక్ష్మీనారాయణ, కైలాస నవీన్, గౌరిశెట్టి సుమన్, రావికంటి కృష్ణకిషోర్, కొండ రాంబాబు, రామిడి శ్రీధర్, మాడూరి మల్లేశం, కల్చరల్, డివిజనల్ కో ఆర్డినేటర్ నలుమాచు చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు. కాగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి షిర్డీసాయి భక్త భజనమండలి ఆధ్వర్యంలో మణిద్వీపవర్ణన, హనుమాన్ చాలీసా పారాయణాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. 10-30 గంటల నుంచి కల్యాణం, హనుమాన్ భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు.



ఎదుర్కోలు వేడుకలో పాల్గొన్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇల్లంతకుంట, మే 4: మండల కేంద్రానికి చెందిన చేరాల శ్రీనివాస్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో శనివారం గాయపడ్డాడు. ద్విచక్రవాహనంపై సిద్దిపేటకు వెళ్లి తిరిగి ఇల్లంతకుంటకు వస్తుండగా వెంకట్రావుపల్లె సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

వృద్ధురాలి ఆత్మహత్య


దేవవ్వ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 4: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అనారోగ్య సమస్యలు భరించలేక వృద్ధురాలు బాద దేవవ్వ(85) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని దేవవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. కొడుకు బాలలింగం వద్ద ఉంటూ కాలం వెల్లదీస్తోంది. ఓ వైపు అనారోగ్యం.. మరో వైపు వృద్ధాప్యంతో మనస్థాపానికి గురైంది. శుక్రవారం ఇంటిలో నుంచి బయటకు వెళ్లిన దేవవ్వ చీకటి పడినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శనివారం శవమై తేలింది. అటు వైపు వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లారు. స్థానికుల సహాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలు కొడుకు బాలలింగం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

వృద్ధుడి ఆత్మహత్య


ఎల్లయ్య (ఫైల్)

చందుర్తి మే 4: ఒంటరితనం భరించలేక ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో శనివారం ఈ ఘటన వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన కొమ్ము ఎల్లయ్య (70) భార్య పిల్లలు లేకపోవడంతో పాటు వృద్ధాప్య భారంతో జీవితంపై విరక్తి చెంది వారం రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. శనివారం తునికి ఆకు సేకరణకు వెళ్లిన గ్రామస్థులకు కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం కనిపించింది. సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించేందుకే సఖీ సెంటర్

● జగిత్యాల కోర్టు న్యాయాధికారి ప్రసాద్


సఖీ కేంద్ర నిర్వాహకులతో న్యాయమూర్తి ప్రసాద్

జగిత్యాల టౌన్, మే4 : మహిళలు సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం సఖీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జగిత్యాల కోర్టు న్యాయాధికారి ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఉన్న సఖీ కేంద్రంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. న్యాయమూర్తి ప్రసాద్ హాజరై మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న మహి ళలను అన్ని విధాలా ఆదుకునే చోటుతో పాటు గృహ హింస, వేధింపులు, దాడులు, ప్రమాదాలకు గురైన మహిళలకు తక్షణ న్యాయ సహాయం అందించడమే సఖీ కేంద్ర లక్ష్యమన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారి వాణిశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, లీగల్ ఏయిడ్ కౌన్సిల్స్ న్యాయవాదులు చంద్రమోహన్, సతీష్, విజయ్ కృష్ణ, సఖీ అడ్మినిస్ట్రేషన్ మనీల, అశ్విని, జిల్లా లీగల్ సర్వీసేస్ సూపరింటెండెంట్ వెంకన్న, సిబ్బంది జాన్సన్ ఉన్నారు.


● ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ప్రభుత్వం తరపున ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు జగిత్యాల కోర్టు న్యామూర్తి ప్రసాద్ పేర్కొన్నారు. జగిత్యాల సబ్ జైలును శనివారం న్యాయమూర్తి ప్రసాద్ సందర్శించారు. ఖైదీలకు అం దుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీ లు సత్ ప్రవర్తనతో మెదలాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై తప్పని సరిగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. లీగల్ ఏయిడ్ కౌన్సిల్స్ న్యాయవా దులు చంద్రమోహన్, సతీష్, విజయ్ కృష్ణ, జైలర్ మొగిలేష్ తదితరులు ఉన్నారు.

ఆటోకు నిప్పు పెట్టిన దుండగులు


మంటల్లో కాలిపోయిన ఆటో

కోరుట్ల, మే 4: పట్టణంలోని ఝాన్సీ రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి మ్యాజిక్ ఆటోకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితుడు బొలిశెట్టి నరేందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నరేందర్ ఇంటి సమీపంలో ఆటోను ఉంచి ఇంట్లో నిద్రిస్తు న్న సమయంలో సుమారు 3 గంటల ప్రాంతంలో ఆటోలో మంటలు ఎగిసి పడుతుండగా గుర్తించి చుట్టు పక్కలవారి సాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. స్థానికుల సహాయంలో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పివేశారు. బాధితుడు నరేందర్ పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బంకి ఫిర్యాదు చేశాడు. కాలనీలో పలువురిపై అనుమానం ఉన్నట్లు నరేందర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలన జరిపి ఆకోణంలో విచారణ చేపట్టారు.

చెరువు మట్టి తవ్వకాలను అడ్డుకున్న అధికారులు


మట్టి తవ్వకాలు చేస్తున్న జేసీబీ

మల్యాల, మే 4: మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో గల కొత్త చెరువు నుంచి కొందరు అక్రమంగా మట్టి తరలిస్తుండగా అధికారులు అడ్డున్నారు. నాలుగు రోజులుగా మట్టి తరలిస్తుండడంతో గ్రామస్థులు శనివారం ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జేసీబీతో తవ్వకాలు చేప డుతూ మట్టి తరలించడంపై చర్యలు తీసుకోవాలని కోరగా ఇరిగేషన్ సిబ్బంది అక్కడకు చేరుకొని జేసీబీని పట్టుకున్నారు. అయితే సిబ్బందిని అడ్డగించి దాన్ని పట్టుకెళ్లిన్నట్లు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చెరువు వద్ద పరిశీలించారు. అనుమతులు లేకుండా సాగుతున్న ఈ వ్యవహారంపై చర్యలు తీసుకొని మరోసారి పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

దేశ భద్రత, భవిష్యత్‌కు సంబంధించిన ఎన్నికలు

● భారత్‌పై దాడి చేయాలనే ఆలోచనను తుంచిన నేత మోదీ ● ప్రజ్ఞాభారతి సదస్సులో బండి సంజయ్


సదస్సులో పాల్గొన్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 4: ఈ ఎన్నికలు దేశ భద్రత, భవిష్యత్‌కు సంబంధించిన ఎన్నికలు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాత్రి నగరంలోని సీతారాంపూర్‌లో ప్రజ్ఞాభారతి మేధావులు నిర్వహించిన 'ప్రగతి పథంలో భారత దేశం' అనే సదస్సులో ఆయన మాట్లాడుతూ సర్జికల్ స్ట్రయిక్స్‌తో టెర్రరిస్టుల వెన్నులో వణుకు పుట్టించిన నేత మోదీ అని అన్నారు. దేశ భవిష్యత్తు భద్రత విషయంలో స్పష్టమైన విజన్ ఉన్న మహానేత నరేంద్రమోదీ అన్నారు. విజన్‌తో పాటు ఇజం లేని పార్టీ కాంగ్రెస్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ముగ్గురు అభ్యర్థులను బేరీజు వేసుకుని ఓటు వేయాలన్నారు. కరీంనగర్‌లో 12 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. మీరంతా మేధావులు ప్రతి అంశాన్ని లోతుగా ఆలోచించి సమాజానికి ఏది మంచిదో చెప్పే వారు మీరన్నారు. బీజేపీ పక్షాన ప్రధాని అభ్యర్థిగా బరిలో దిగుతున్న మోదీని చూసి బీజేపీ సిద్ధాంతాలను విధానాలను చూసి ఓటేయాలన్నారు. కాంగ్రెస్ కూటమికి ప్రధాని అభ్యర్థి లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా పోటీ చేసే స్థానాలే 310కి మించడం లేదని మరి అధికారంలోకి ఎలా వస్తుందన్నారు. 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్య రామమందిర నిర్మాణం వంటి చర్యలతో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటే గర్వంగా భావించా అన్నారు. జవాన్లకు మనోధైర్యం కల్పించేందుకు సియాచిన్ దేశ సరిహద్దులకు పోయి ప్రతిఏటా దీపావళి పండుగ జరుపుకుంటూ మనోనిబ్బరాన్ని కలిగిస్తూ మోదీ దేశరక్షణ రంగాన్ని పటిష్ఠం చేస్తున్నారన్నారు. విదేశాంగ విధానంలో ప్రపంచంలోనే భారత్‌నెంబర్‌వన్‌గా ఉండేలా చేస్తున్నారన్నారు. కరోనాతో సమయంలో ఆత్మనిర్భర భారత్ ప్యాకేజీతో దేశాన్ని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారన్నారు.

వేద విజ్ఞానం విస్తరిల్లిన పుణ్యభూమి భారతదేశం

● కరీంనగర్ కల్చరల్: ప్రపంచంలో నాగరికత కన్ను తెరువకముందే వేద విజ్ఞానం విస్తరిల్లిన పుణ్యభూమి భారతదేశమని కాలమిస్టు, రచయిత, రాజకీయ విశ్లేషకుడు, రామాయణ పాఠశాల స్థాపకుడు శంతన్‌గుప్తా అన్నారు. శనివారం ఆర్‌బీవిఆర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ భారత్' అంశంపై సెమినార్, ఆయన రాసిన '101 కారణాలు' పుస్తకంపై సమీక్షకు ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. దేశం ఐదవ ఆర్థిక శక్తిగా మారి విశ్వ గురువు స్థాయికి చేరుకుందని అన్నారు. ప్రజ్ఞాభారతి చైర్మన్ డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి మందల నగేశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిరంజనాచారి పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల,మే 4: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.

కొండగట్టు ఈవో సస్పెన్షన్‌పై మధ్యంతర ఉత్తర్వులు

మల్యాల, మే 4: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవో వెంకటేష్‌పై గత మార్చి 23న దేవాదాయ కమిషనర్ సస్పెన్షన్ వేటు వేయగా హైకోర్టు ఆ సస్పెన్షన్‌పై ఇంటీరియం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ఉద్యోగి ఒకరు దేవస్థానం సొమ్ముల దుర్వినియోగంపై నిర్లక్ష్యం, అలసత్వంగా వ్యవహరించారని పేర్కొంటూ ఈవో వెంకటేష్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడంతో వెంకటేష్ హైకోర్టును ఆశ్రయించారు. సొమ్ముల దుర్వినియోగంకు పాల్పడిన సదరు ఉద్యోగిని సస్పెండ్ చేయడంతో పాటు పోలీస్ కేసు నమోదు చేయడం జరిగిందని కోర్టుకు విన్నవించారు. తాను కొండగట్టులో చేరకముందు జరిగిన వ్యవహారంగా కోర్టుకు తెలుపడంతో న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ ఆయన ప్రస్తుత డీసీ స్థాయి పోస్టులో నియమించుకోవచ్చునని పేర్కొంది. తదుపరి విచారణ జూన్ 27కు వాయిదా వేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి

తంగళ్లపల్లి, మే 4: ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఎస్‌ఐ సుధాకర్ కోరారు. శనివారం తంగళ్లపల్లి మండలంలోని సమస్యాత్మక గ్రామాలు తాడూరు, తంగళ్లపల్లి, మండెపల్లి గ్రామాలలో పోలీస్ కవాతు నిర్వహించారు. అనంతరం ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా సహకరించారని అదే విధంగా ఈ ఎన్నికలు కూడా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మండలంలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని దీంట్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాలలో కేంద్ర బలగాలతో పాటు కవాతు నిర్వహించి ఎన్నికల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో పార్టీల నాయకులు, యువకులు, ప్రజలు ఎన్నికల నియామావళిని ఉల్లంగించకుండా ప్రచారం నిర్వహించుకోవాలని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చంద్రమౌళి, హెడ్‌కానిస్టేబుల్‌లు సాంబశివరావు, సుధాకర్, మల్లేశం, కానిస్టేబుల్‌లు నరేందర్, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్,రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన అమలు చేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ నారాయణ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4: ప్రజాపాలన అమలు చేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ కూరపాటి వెంకట్ నారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ బడా వ్యాపారులకు అండగా ఉంటున్నారని విమర్శించారు. 10 శాతం జనాభా కూడా లేని ధనవంతులకు దేశ సంపదలో 72శాతం సమకూర్చారని అన్నారు. ప్రతి వార్షిక సంవత్సర ఆదాయం కేవలం ఒక్క శాతం ప్రజలకు 25శాతం ఆదాయం దక్కుతున్నా, దేశం వెలిగిపోతుందని, ప్రకాశిస్తుందని డంబాచారం చేయడం పేద ప్రజలను అగౌరవపరచడమేనని ఎద్దేవా చేశారు. నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్‌పై వేసిన జీఎస్టీ కారణంగా చిరు వ్యాపార వ్యవస్థలన్నీ విధ్వంసానికి గురయ్యాయని అన్నారు. మోదీ పాలనలో అదానీ, అంబానీ, వేదాంత లాంటి ధనవంతులకే ప్రయోజనాలు కలిగే విధంగా మేలు చేస్తున్నారని ఆరోపించారు. సమాజ అభివృద్ధికి తోడ్పడే విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ రంగాలను మోదీ పాలనలో నిర్వీర్యం చేశారన్నారు. గత పది సంవత్సరాల నుంచి కేంద్రం చిల్లి గవ్వ చెల్లించకపోవడం వల్ల కళాశాలలు, యూనివర్శిటీలు, పెద్ద పెద్ద విద్యా సంస్థలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యాలయాలకు లక్షల రూపాయల ఫీజు చెల్లించి, పట్టాలు పొందిన యువతీ యువకులు ఉపాధి, ఉద్యోగాలు లభించని దేశాన్ని సంపన్న దేశంగా ఏ విధంగా అంటారని ప్రశ్నించారు. జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మెన్ డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ ప్రతి దశాబ్దానికి ఒకసారి లెక్కలు చేసే విధానాన్ని మోదీ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. పేద వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలియచేసే జనాభా లెక్కలు ఉద్దేశపూర్వకంగా, కుట్ర పూరితంగానే మోదీ ప్రభుత్వం ఆపివేసిందని అన్నారు. దీనికి బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. జనగణన చేయని మోదీకి జనగనమన పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. దేశంలో పేదలందరికీ విద్యా, వైద్యం అందించేలా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ నీలం సంపత్‌కుమార్, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, డాక్టర్ వంగాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీకి ఓటు వేయకపోతేనే దేశానికి భవిష్యత్

● రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి
● జగిత్యాలకు చేరుకున్న జాగో తెలంగాణ బస్సుయాత్ర



జగిత్యాలలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

జగిత్యాల అర్బన్, మే 4: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీకి ఓటు వేయకపోతేనే ఈ దేశానికి భవిష్యత్ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక బాధ్యులు, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చే విధంగా సాగుతున్న ప్రజా వ్యతిరేక, ఫాసిస్టు విధానాలను నిరసిస్తూ ఓటు వేసే ముందు మతోన్మాద పాలకవర్గాల పార్టీల స్వభావాన్ని గుర్తించాలనే నినాదంతో ప్రజలను చైతన్య పర్చేందుకు ప్రారంభించిన బస్సుయాత్ర శనివారం జగిత్యాల జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక సామాజిక ఉద్యమకారులు బస్సు యాత్రకు స్వాగతం పలకగా, స్థానిక పాత బస్టాండ్ చౌరస్తా వద్ద ఓటరు అవగాహన కార్యక్రమంతో పాటు, విద్వేష విభజన, నియంతృత్వ అప్రజాస్వామిక రాజకీయాలు చేస్తున్న వారిని ఓడించాలని యాత్ర ద్వారా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఐఏఎస్ మురళి మాట్లాడుతూ గత పాలకులైన బీఆర్ఎస్ అధినేత పాలనపై కూడా తీర్పు ఇవ్వాలని గతంలో ఈ యాత్ర చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు కేంద్రానికి సంబంధించినవి గనుక పదేళ్లుగా ఈ దేశాన్ని పాలిస్తున్న మోదీ పాలనపై తీర్పు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మోదీ పాలన, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను వివరించేందుకే జగిత్యాలకు రావడం జరిగిందన్నారు. ప్రతిపక్షాలను విమర్శించడమే తప్ప, ఆయన చేసింది చెప్పడని మోదీపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి సుమారు 12లక్షల కోట్ల రూపాయలు కేంద్రానికి చెల్లిస్తే, రాష్ట్రంలో కేంద్రం నుంచి విడుదల చేసిన నిధులతో ఒక్క బడి, ఒక ఆసుపత్రి, పేదలకు ఇళ్లు కట్టించాడా? ఉద్యోగాలు యువతకు ఇచ్చాడా అనేది అడగాల్సిన సమయం ఇదేనన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి, పేదళ్లలో 20కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా ఎన్ని ఉద్యోగాలు కేంద్ర ప్రభుత్వం కల్పించిందో ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. బీజేపీ సంపన్న వర్గాలకు సేవచేసే పార్టీ మాత్రమే తప్ప, పేదలకు న్యాయం చేయడని మండిపడ్డారు. బీసీ ప్రధాన మంత్రి అయ్యి ఉండి, బీసీల కులగణన ఎందుకు చేయడని ఆయన ప్రశ్నించిన ఆయన, 2శాతం ఉన్న అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్‌లు ఇచ్చి, 50శాతం పైగా ఉన్న బీసీలకు కేవలం సగం మాత్రమే రిజర్వేషన్‌లు కేటాయించడం వెనుక ఆంతర్యం ఏంటని మురళి ప్రశ్నించారు. కార్యక్రమంలో యాత్ర సభ్యులు లక్ష్మీ నారాయణ, హన్మాష్, నైనాల గోవర్ధన్, పద్మజషా, డాక్టర్ జగదీశ్వర్, శ్రీకాంత్, తిరుపతి, సౌజన్య, గౌస్, అంజి, బాలు, కల్పనతో పాటు స్థానిక సామాజిక సంఘాల నాయకులు బండ శంకర్, చెనాల సుమన్, పల్లె రమేష్, మెరుగు స్వామి తదితరులున్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

జగిత్యాల టౌన్, మే 4: కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణీపేటలో జరిగింది. పురాణీపేటకు చెందిన బింగి నవీన్(35)కు జ్యోత్స్నతో వివాహం జరిగింది. వీరిద్దరి మధ్య తగాదాలు ఏర్పడడంతో నవీన్‌పై నెల రోజుల క్రితం వరకట్నం కేసు నమోదైంది. అప్పటి నుంచి ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్న నవీన్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, మే 4: కరీంనగర్‌లో మద్యం సేవించి వాహనా లు నడిపి పట్టుబడిన 12 మంది వ్యక్తులను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ ఇద్దరు వ్యక్తులకు ఏడు రోజుల జైలు శిక్ష, రూ.4,500ల జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. మిగతా 10 మంది వ్యక్తులకు 16 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

లారీల కొరత తీర్చాలని రైతుల నిరసన

కోనరావుపేట, మే 4: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో లారీలు రాక కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు పేరుకపోయాయని లారీల కొరత తీర్చాలని శనివారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసి పది రోజులు గడుస్తున్నా ధాన్యం తరలించడం లేదని అన్నారు. దీని వల్ల ధాన్యం బస్తాల వద్ద రాత్రిపూట కాపలా కాయాల్సి వస్తుందని అన్నారు. లారీలు రాక ధాన్యం తరలించడం లేదని అన్నారు. అధికారులు స్పందించి లారీల కొరతను తీర్చి వెం టనే తరలించాలని కోరారు.

వేముల రోహిత్ కేసును మళ్లీ విచారించాలి

భగత్‌నగర్, మే 4: వేముల రోహిత్ కేసును మళ్లీ విచారించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రోహిత్ కేసులో జాప్యం లేకుండా పునర్విచారణ చేపట్టి నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మచ్చ రమేష్, జేరిపోతుల జనార్ధన్, అక్రమ్, రేణికుంట్ల ప్రీతం, సంగెం మధు, రామారపు వెంకటేష్, రంజిత్, మామిడిపల్లి హేమంత్, చాట్ల సమ్మయ్యకనకంసాగర్, సాయి ఆజాద్ పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్ కేసులో ఇద్దరి అరెస్టు


నిందితులను అరెస్టు చేస్తున్న కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ క్రైం, మే 4 : అప్పుగా డబ్బు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడమే గాక, ఆ డబ్బులకుగాను వేరొకరికి చెందిన ఇంటి స్థలాన్ని అసలు యజమానికి బదులుగా మరొక వ్యక్తిచేత తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం మంగలపల్లికి చెందిన గంప రమాదేవి కుటుంబం బతుకుదెరువు నిమిత్తం కరీంనగర్‌లో 2013 నుంచి 2018 వరకు కిరాణం షాపు ఏర్పాటు చేసుకుని నివసించారు. ఆ సమయములో ఆమె గ్రామానికి చెందిన దేవసాని శ్రావణ్‌కుమార్, తన బంధువైన గుంటుకల తిరుపతి రూ..2 లక్షల రూపాయలు అప్పు కావాలని అడగగా తిరుపతి అనే వ్యక్తికి 2014 సంవత్సరంలో 2 లక్షలు అప్పు ఇచ్చింది. ఒక ఏడాది వరకు తిరిగి ఇస్తానని చెప్పిన తిరుపతి తిరిగి డబ్బులు ఇవ్వలేదు. దీంతో శ్రావణ్‌కుమార్, తిరుపతిలను డబ్బులు ఇవ్వమని రమాదేవిని ఒత్తిడిచేయగా దేవసాని శ్రావణ్ కుమార్, గుంటుక తిరుపతిలు డబ్బులకు బదులుగా కరీంనగర్ తీగలగుట్టపల్లె శివారులో సర్వే నెం. 252లో ప్లాట్ నెం. 8 విస్తీర్ణము 248 చదరపు గజముల స్థలం ఉందని, ఈ స్థలం విద్యానగర్‌కు చెందిన పటేల్ సుధీర్ పేరిట ఉందని, ఆ స్థలాన్ని విక్రయిస్తానని చెప్పారు. వారి మాటలు నమ్మిన రమాదేవి ఆ స్థలానికి 15 లక్షల ధర నిర్ణయించారు. ఆ స్థలాన్ని పటేల్ సుధీర్‌తో రిజిస్ట్రేషన్ చేపిస్తానని చెప్పిన దెవసాని శ్రావణ్ కుమార్, గుంటక తిరుపతిల మాటలు నమ్మి వారికి అప్పుగా ఇచ్చిన 2 లక్షల రూపాయలు మినహాయించుకుని మిగతా 13 లక్షల రూపాయలు ముట్టజెప్పింది. ఆ తర్వాత 2017 ఫిబ్రవరి 2న రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా శ్రావణ్‌కుమార్, గుంటుక తిరుపతిలు పటేల్ సుధీర్‌కు బదులుగా రాంనగర్‌కు చెందిన పోరండ్ల శ్రీనివాస్‌ను ఆ స్థలం అసలు యజమానైన పటేల్ సుధీర్‌గా చూపించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారు. ఇదిలా ఉండగా 2021లో రమాదేవి తన స్థలంలో బేస్‌మెట్ నిర్మించేందుకు వెళ్లగా అక్కడికి భోగ నవీన్ అనే వ్యక్తి వచ్చి ఇది నా ప్లాట్ అని, డాక్యుమెంట్లు చూపించాడు. అందులో పటేల్ సుధీర్ అమ్మినట్లుగా ఉంది. కాని ఫొటోలో ఉన్న వ్యక్తి ఇద్దరి డాక్యుమెంట్లలో వేరువేరుగా ఉన్నారు. అప్పుడు దీనిపై ఆరా తీయగా శ్రావణ్, తిరుపతిలు రమాదేవిని మోసం చేయాలనే ఉద్దేశ్యముతో పోరండ్ల శ్రీనివాస్‌ను తీసుకొచ్చి పటేల్ సుధీర్‌గా చూపించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారని తెలిసింది. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టిన కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్ కుమార్ , బాధితురాలు ఫిర్యాదులో తెలిపిన విషయాలు నిజమేనని వెల్లడైనందున ఇద్దరిపై ఐపీసీ సెక్షన్ 419, 420, 467, 468, 506, 471, 120బి రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేశారు. నిందితులు ఇద్దరిని శనివారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా కేసును పరిశీలించిన మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించగా నిందితులను కరీంనగర్ జైలుకు తరలించారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి


అగ్నిప్రమాదానికి గురైన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి రూరల్, మే4: మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతు, గీత కార్మికులను ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. అగ్ని ప్రమా దానికి గురైన పొలాలు, ఈత వనాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. బాధితులకు నష్ట పరిహారం అందజేయాలని సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వంతుగా తక్షణ సహాయం కింద రైతు వెంగంటి శ్రీనివాస్‌గౌడ్‌కు రూ. 10వేలు, గీత కార్మికులకు రూ. 50వేల ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చి ప్రభుత్వం తరుపున నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానన్నారు. నాయబ్ తహసీల్దార్ రాజ్‌మహ్మద్, ఎక్సైజ్ ఇంచార్జి సీఐ ప్రదీప్ రావులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల నుంచి అధికారులు ఫిర్యాదు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు పుల్ల జగన్ గౌడ్, దాకూరి వెంకటేష్, ముదాం నర్సింహులు, వెంగంటి లక్ష్మణ్‌గౌడ్, రైతులు, గీత కార్మికులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి


పనులు పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్

ఇల్లంతకుంట, మే 4: జాబ్‌కార్డులు ఉన్నవారందరూ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట సింగరాయకుంటలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం రాష్ట్రబృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, పనులు జరిగే ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. డీఆర్డీవో శేషాద్రి, కమిటీ సభ్యుడు అభయ్‌కుమార్, ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఏపీవో చంద్రయ్య, ఈసీ అర్షద్, డీఆర్పీ తిరుమలేష్, కార్యదర్శి సంధ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడ్డం వంశీకి మద్దతుగా ప్రచారం

సుల్తానాబాద్, మే 4: పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే విజయరమణారావు మండలంలోని గట్టేపల్లి, కదంబాపూర్, తొగర్రాయి, మంచరామి, కనుకుల గ్రామాలలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు ఇల్లెందుల శ్రీనివాస్‌గౌడ్, ఉప్పు సంపత్, రాజయ్యమూల సత్యం, గుండా మురళి, సది, అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాష్‌రావు, దామోదర్‌రావు, శ్రీగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, కౌన్సిలర్లు, నాయకులు కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

సింగరేణి కార్మికులపై కేసీఆర్‌ది కపట ప్రేమ

పాలకుర్తి, మే 4: సింగరేణి కార్మికులపై కేసీఆర్‌ది కపట ప్రేమ అని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. శనివారం మండలంలోని రామరావుపల్లిలో చేయి గుర్తుకు ఓటు వేసి గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, కేశోరాం పర్మినెంటు యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి, కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య, ఎంపీటీసీ గంగాధరి రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

ఓదెల, మే 4 : మండలంలోని నాంసానిపల్లి, మడక గ్రామాలలో శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అలాగే కొలానూరులో పలు వీధుల్లో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవి గౌడ్ ఆధ్వర్యంలో అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి తోపాటు, డొడ్డే శంకర్, పర్ష రమేష్, కొల్లూరి చందు, సామమోహన్ కుమార్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, మే 4: మండలంలోని వెన్నంపల్లి, మంగపేట, జాఫర్‌ఖాన్‌పేట గ్రామాల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఉపాధి కూలీలు, హమాలీల వద్ద ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సదయ్య, శివరామకృష్ణ, ఎండీ ఖలీల్, సబ్బని రాజమల్లు, కలవేన రమేష్, వెల్తూరి రమేష్, యాదగిరి శ్రీనివాస్, సునీల్ రావు పాల్గొన్నారు.

మోదీని ప్రధానిగా కోరుకుంటున్నారు

కాల్వశ్రీరాంపూర్, మే 4: నరేంద్రమోదీని ప్రధానిగా ప్రజలు కోరుకుంటున్నారని పెద్దపెల్లి బీజేపీ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెన్నంపల్లి నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు, కార్యవర్గ సభ్యులు గొట్టేముక్కుల సురేష్‌రెడ్డి, శిలారపు పర్వతాలు, మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ పాల్గొన్నారు.

ఎంపీపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం

సుల్తానాబాద్, మే 4: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ ఎంపీపీ బాలాజీరావు ఆధ్వర్యంలో శనివారం చిన్న బొంకూర్, మియాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పకీర్ యాదవ్, భూమేష్, రాజమల్లయ్య పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్ మద్దతుగా ప్రచారం

ధర్మారం, మే 4: పెద్దపల్లి ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం శనివారం మండలంలోని ఎర్రగుంటపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

జూలపల్లిలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

జూలపల్లి, మే 4: మండలకేంద్రంతో పాటు వడుకాపూర్ తదితర గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపిగా వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. కొండి సతీష్, జెట్టి సతీష్, పాటకుల నర్సయ్య, అతీక్‌పాష, వేల్పుల గట్టయ్య పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకోవాలి

మంథనిరూరల్, మే 4: కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించునే బాధ్యత అందరిదని జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. శనివారం మంథని మండలం ఆరెంద, మల్లారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పని ప్రదేశాల్లో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బీజేపీ అభ్యర్థి ప్రచారం

సుల్తానాబాద్, మే 4: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్ శనివారం సుల్తానాబాద్‌లో ప్రచారం నిర్వహించారు. స్థానిక గట్టేపల్లి రోడ్డు వద్ద ఆయనకు బీజేపీ కార్యకర్తలు నాయకులు స్వాగతం పలికారు. ఇందిరానగర్ నుంచి కాట్నపల్లి వరకు రోడ్డు శ్రీనివాస్ తన ప్రచారం కొనసాగించారు. వెంట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో సమస్యల తిష్ఠ

- బెంచీలు, బెడ్లు, ఫ్యాన్లు లేక రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు - పట్టించుకోని అధికారులు



సుల్తానాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల


తరగతి గదిలో బెంచీలు లేక నేలపైన కూర్చున్న విద్యార్థులు

సుల్తానాబాద్, మే 4: సుల్తానాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో తాగునీరు, స్నానాల కోసం కూడా అవస్థలు పడుతున్నారు. బాత్రూంల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కంపుకొడుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నారు. కళాశాలలో పడుకోవడానికి బెడ్లు, దుప్పట్లు, పరుపులు కానీలేవు. భవనం కూడా ఊరికి దూరంగా అపరిశుభ్రమైన వాతావరణంలో ఉంది. కాలుష్యం వెదజల్లే ప్రాంతం కావడంతో కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేకుండాపోయింది. ఎస్సారెస్పీకి చెందిన చిన్నకాలువపై నుంచి ఈ హాస్టల్‌కు వెళ్లాల్సిఉంది. ఒక్కో గదిలో నలభై మంది విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. ఇందులో ఉన్న రెండు ఫ్యాన్లు అందరికీ సరిపోవడం లేదు. ఇవే గదుల్లో రాత్రిపూట కిందనే పడుకోవాల్సి వస్తోందని, ఉక్కపోతతో సతమతమవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తరగతుల నిర్వహణ అధ్వానంగా ఉంది. తరగతి గదుల్లో బెంచీలు లేవు. అందరికీ కిందనే పాఠాలు చెబుతున్నారు. అన్నంలో తరచూ ముెలలు వస్తున్నాయని, ఉడకని అన్నం పెడుతున్నారని, పప్పులో దారాలు వస్తున్నాయని విద్యార్థులు ఆరోపించారు. డైనింగ్ హాల్ అపరిశుభ్రంగా ఉంటుందని అందులో సగం వరకు మాత్రమే పని చేస్తాయని, ఉక్కపోతతో చెమటలు పట్టి తిండి సహించదన్నారు. తాగడానికి మంచినీరు కూడా ఉండడం లేదని, మిషన్ భగీరథనీరు నేరుగా ఇస్తున్నారని, అవి ప్యూరిఫైడ్ కావడం లేదని ఒకోసారి కలుషిత నీరు సరఫరా అవుతుందని విద్యార్థులు చెప్పారు. వాటర్ పడక తమలో చాలా మందికి స్కిన్ ఎలర్జీ సంక్రమించిందని దాంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తాగే నీటిలో ఒక్కోసారి పురుగులు వస్తున్నాయని, బాత్రూమ్‌లు కంపు కొడుతున్నాయని వాటిలో నీరు ఉండదని టాయిలెట్స్ ఉపయోగిస్తే తామే బయట నుంచి టబ్బుల్లో వెంట నీరు తీసుకెళ్లాల్సి వస్తుందని అన్నారు. ట్యాంకుల ద్వారా నల్లాల సౌకర్యాల లేదన్నారు. వాష్‌రూముల కంపు భరించలేక తామే నీరు తెచ్చి అపుడపుడు వాటిని శుభ్రం చేసుకుంటున్నమని వారన్నారు. తరగతి గదులకు కొన్నింటికి కిటికీలు ఉన్నా తలుపులు లేకపోవడంతో రాత్రి పూట దోమల బెడద తీవ్రంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కనీస సౌకార్యలు కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మే 4: ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకున్నదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పారు. శనివారం రాత్రి 48వ డివిజన్ కార్పొరేటర్ పొన్నం విద్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో వంద మంది చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆరు గ్యారంటీపథకాలు హామీ ఇచ్చిందని, వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టిందని, ఎన్నికల తరువాత మరో గ్యారంటీ పథకాన్ని అమలు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహంకాళి స్వామి, పొన్నం లక్ష్మణ్, బెండ్రం నాగభూషణ్, హమీద్, సిర్ర సంపత్‌రెడ్డి, దప్పు రాంమూర్తి, చిదురాల అశోక్, పెరుమాండ్లు, సత్యం, రాజేందర్ పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు కరువు

- పట్టించుకోని అధికారులు - ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కీచులాటపల్లి గ్రామ శివారులో నిర్మించిన శ్మశానవాటిక

జూలపల్లి, మే 4: మండలంలోని గ్రామాల్లో నిర్మించిన శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు ముందుకు రావడంలేదు. గతంలో మృతదేహాలను ఖననం చేసేందుకు అవసరమైన స్థలాలులేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన అప్పటి ప్రభుత్వం ఆయా గ్రామపంచాయతీల పరిధిలో శ్మశానవాటికలకు అనువైన స్థలాలను గుర్తించింది. శ్మశానవాటికల నిర్మాణానికి ప్రత్యేకంగా ఈజీఎస్, ప్రభుత్వ నిధులను వెచ్చించి నిర్మాణాలను చేపట్టారు. శ్మశానవాటికల్లో అంత్యక్రియల అనంతరం ప్రజలకు అవసరమైన కనీస సౌకార్యాలను ఏర్పాటుచేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను సంబంధిత అధికారులు పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. శ్మశానవాటికల్లో స్నానాలగదులు, మరుగుదొడ్లు, టాయిలెట్స్‌ను సైతం అరకొరగా నిర్మించి నీటి సౌకర్యాన్ని ఏర్పాటుచేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని 13 గ్రామపంచాయతీల పరిధిలో శ్మశానవాటికల నిర్మాణాలు గత ప్రభుత్వ హయాంలోనే చేపట్టినప్పటికీ జూలపల్లి, కుమ్మరికుంట, కోనరావుపేట గ్రామ పంచాయతీల్లో మాత్రమే నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసి, మిగతా వాటిల్లో నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని కీచులాటపల్లి పరిధిలో శ్మశానవాటిక నిర్మించినప్పటికీ ఊరికి దూరంగా ఉండడం వల్ల దాని పరిస్థితి అధ్వానంగా తయారైంది. శ్మశానవాటికకు ప్రధాన గేటు ముళ్లపొదలు, పిచ్చిచెట్లతో నిండిపోయి లోపలికి వెళ్లలేని విధంగా తయారైంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలి

- తమిళనాడు బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వినోద్ సెల్వం


సమావేశంలో మాట్లాడుతున్న వినోద్ సెల్వం

మంథని, మే 4: కార్యకర్తలు పట్టుదలతో కృషి చేస్తే పెద్దపల్లిలో బీజేపీ పార్టీ విజయం సాధిస్తుందని తమిళనాడు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ సెల్వం ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో వినోద్ సెల్వం పాల్గొనడంతోపాటు బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు మద్దతుగా పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం మరింతగా అభివృద్ధి చెందాలంటే, బడుగుబలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే బీజేపీని గెలిపించాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో బీజేపీ పార్టీకి తిరుగులేదని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లతో దేశంలో బీజేపీ మళ్లీ అధికారం చేపట్టబోతోందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రు పట్ల సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. మళ్లీ మోదీ ప్రధాన మంత్రిగా చూడటానికి, పెద్దపల్లిలో బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు చల్లా నారాయణరెడ్డి, కొండపాక సత్యప్రకాష్, మల్కామోహన్‌రావు, నాంపల్లి రమేష్, బాగోజు శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.



బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నం..

- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్

గోదావరిఖని, మే 4: బీఐఎఫ్‌ఆర్‌కు వెళ్లిన సింగరేణి సంస్థను మారిటోరియం ఇప్పించి కాపాడిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, బీజేపీ, బీఆర్ఎస్ కలిసి సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఒక ప్రకటనలో ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం గోదావరిఖనిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి కార్మికుల మీద కపట ప్రేమ చూపించి కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు చేశాడని ఆయన అన్నారు. అయితే కేసీఆర్ మాటల్ని సింగరేణి కార్మికవర్గం నమ్మే పరిస్థితుల్లో లేదని జనక్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి కార్మికులు చిత్తుగా ఓడించారని, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌కు అదే గతి పడుతుందని జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సింగరేణి సొమ్ము రూ.30వేల కోట్లు వాడుకుని ఒక నూతన బొగ్గు బావిని తేలేదని, నిన్నమొన్నటి వరకు బీజేపీతో అంటకాగి అన్ని బిల్లుల్లో, విషయాల్లో సహకరించింది కేసీఆరేనని అన్నారు. ఎంఎండీఆర్ యాక్టుకు పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలిపి సింగరేణి ప్రైవేటీకరణకు కారకులయ్యారని, కేసీఆర్ హయాంలోనే కోయగూడెం ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో సింగరేణి కార్మికులు కాం గ్రెస్ అభ్యర్థులకు మద్దతు పలుకాలని జనక్ ప్రసాద్ కోరారు.

అన్నిరంగాల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలం

మందమర్రిటౌన్, మే 4: సింగరేణిలో గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అన్నిరంగాల్లో పూర్తిగా విఫలమయ్యాయని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్అహ్మద్ ఆరోపించారు. శనివారం మందమర్రిలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఇంత వరకు గుర్తింపు ధ్రువీకరణ పత్రం తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సంస్థపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదన్నారు. సింగరేణిలో గనులు మూతపడుతున్నాయని, నూతన గనుల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవచూపాలన్నారు. కార్మికులు 40వేల మంది ఉంటే 60వేల క్వార్టర్లు ఉన్నాయని, 20వేల క్వార్టర్ల ఎవరికి ఇచ్చారో సింగరేణి యాజమాన్యానికి తెలియాలన్నారు. సంస్థకు సంబంధం లేని వ్యక్తులకు క్వార్టర్లు ఇస్తున్నారన్నారు.

ఓపెన్‌కాస్టుల్లో షిఫ్టు సమయాలను తగ్గించాలి : ఏఐటీయూసీ


ఓసీపీ-2లో వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రామగిరి, మే 4: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులో షిఫ్టు సమయాలను తగ్గించాలని కోరుతూ శనివారం ఏఐటీయూసీ ఆర్జీ-3 బ్రాంచ్ సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేశారు. ఉత్పత్తి, ఉత్పాదకత పైనే దృష్టి పెట్టకుండా కార్మికుల ఆరోగ్యంపైన దృష్టి సారించాల్సిందిగా వినతి పత్రంలో పేర్కొన్నారు. లేని పక్షంలో ఏఐటీయూసీ పక్షాన సింగరేణి ఉన్నతాధికారులను కలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూపాక రాంచందర్, డిటి రావు, రాజయ్య, పోచం, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సురేష్, రత్నం, మల్లేష్, అక్రమ్, వెంకన్నలు పాల్గొన్నారు.

పని వేళలు మార్చాలని వినతి

యైటింక్లయిన్‌కాలనీ, మే 5: ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో పని వేళలు మార్చకుండా యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఓసీపీ-3 శనివారం కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఎండల తీవ్రత తగ్గే వరకు షిఫ్టు వేళలను మార్చే వారని, ప్రస్తుతం పనివేళలను మార్చాలని కోరినా స్పందించకుండా బాధ్యతా రాహిత్యంగా నడుచుకోవడం బాధాకరమైన విషయమని నాయకులు పేర్కొన్నారు. మొదటి షిఫ్టు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, రెండవ షిఫ్టు సాయంత్రం 4 గంటల నుంచి 11 గంటల వరకు మార్చాలని కోరారు. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున కార్మికుల ఆరోగ్యం దెబ్బ తినకుండా ముందస్తుగా పనివేళలు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కారక్రమంలో ఎల్ ప్రకాష్, రాజారత్నం, రవీందర్, శ్యాంసన్, ఎజ్జ రాజయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-1లో....

ఎండల తీవ్రతలను దృష్టిలో ఉంచుకుని ఓసీపీ-1లో షిఫ్టు వేళలను మార్చాలని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, బీఎంఎస్, హెచ్ఎంఎస్ నాయకులు శనివారం మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశాయి. ఎండల్లో కార్మికులు పని చేసే పరిస్థితులు లేవని తెలిపారు.

కార్మికుల రక్షణపై చర్యలు తీసుకోండి


ఓసీపీ-3లో వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, మే 5: కార్మికుల రక్షణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకులు శనివారం ఓసీపీ-3 మేనేజ్‌మెంట్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. విపరీతమైన ఎండల కారణంగా ఫస్ట్, సెకండ్ షిఫ్టు సమయాలని మార్చాలని ఆర్జీ-2 సెక్రెటరీ కుంట ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఎండ తీవ్రతతో డంపర్‌లలో ఏసీ సరిపోక ఆపరేటర్లు ఇబ్బందులు పడుతున్నారని, క్వారీలో పనిచేసే జనరల్ మజ్దూర్, కేబుల్‌బాయ్స్, ట్రిప్‌మెన్స్, మెయింటనెన్స్ కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. డోజర్లు,గ్రేడర్లు, ట్యాంకర్ల మెయింటనెన్స్ పూర్తిగా జరిగాకే అందుబాటులో ఉంచాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏరియా వైస్‌ప్రెసిడెంట్ వెంకన్న, వైస్‌ప్రెసిడెంట్ రాంప్రసాద్, నాయకులు సారంగం, సంపత్ పాల్గొన్నారు.

ట్రినిటి కళాశాలలో ఫేర్‌వెల్ డే


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, మే 4: జిల్లా కేంద్రంలోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులకు ఫేర్‌వెల్ డే నిర్వహించారు. స్థానిక స్వరూప గార్డెన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ మణిగణేష్, అకాడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్, విభాగాధిపతులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఓడీలు ప్రభాకర్, స్వాతి పద్మిని, ఆరిఫ్, . కౌసల్య. శ్రీధర్,రామ్మోహన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల సంక్షేమానికి పోరాడే వ్యక్తిని గెలిపించాలి'

పెద్దపల్లిటౌన్, మే 4: ప్రజల సంక్షేమం కోసం పోరాడే వ్యక్తిని పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని స్వతంత్ర పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి జనగామ నర్సింగ్ ప్రజలను కోరారు. పెద్దపెల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలో అత్యధికంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మాదిగ అభ్యర్థులను ప్రకటించకపోవడం శోచనీయమని, ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండ్ర భూమేష్, లేంకలపల్లి అనిల్, కుమార్, సతీష్, చందు తదితరులు పాల్గోన్నారు.

కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

పెద్దపల్లిటౌన్, మే 4: పెద్దపల్లి పట్టణ కిరాణా మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక ఆర్యవైశ్య భవన్‌లో ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్దపల్లి పట్టణ కిరాణం మార్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొమురవెల్లి జయప్రకాష్, ఉపాధ్యక్షులుగా ప్రదీప్ లోయదీపారాం, ప్రధాన కార్యదర్శిగా తాటిపల్లి సతీష్, జాయింట్ సెక్రటరీలుగా రాజేందర్, ఎల్లంకి సునీల్, కోశాధికారిగా కే శెట్టి రవీందర్, ఆర్గనైజర్ సెక్రెటరీగా బజ్జూరి సురేష్, ప్రచార కార్యదర్శిగా సతీష్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా కేశెట్టి కృష్ణ, ఫైడి ప్రవీణ్, రాజు, రజినీకాంత్‌రెడ్డి, పెద్ది శబరినాథ్, సయ్యద్ యూసుఫ్, సయ్యద్ ముజాహిద్ , శ్రీనివాస్, ప్రవీణ్, సందీప్, సతీష్, ఎండి షకిల్, శ్రీనివాస్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్దపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కమల్ కిషోర్ శారద, ప్రధాన కార్యదర్శి సయ్యద్ మస్రత్, ఉపాధ్యక్షులు మాడూరి వినోద్, మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి, వరప్రసాద్ సిఏ, న్యాయ సలహాదారు బాదం రమేష్ పాల్గొన్నారు..

ప్రభుత్వ ఆసుపత్రికి ఫ్రీజర్ వితరణ

ఓదెల, మే 4: దివంగత మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు స్మారకార్థం శనివారం వారి కుటుంబ సభ్యులు ఓదెల ప్రభుత్వ ఆసుపత్రికి రూ.20వేలు విలువ చేసే వాటర్ ఫ్రీజర్‌ను వితరణ చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమతరాధాకృష్ణ, రాజమల్లు కుటుంబ సభ్యులు శ్రీనిధి, శ్రీనివాస్, దీప్తి, అనిల్, సంతోష్, రత్నకుమారి, స్వరూప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, చీకట్ల ముండయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అధిక స్థానాల్లో విజయం సాధిస్తుంది'

పెద్దపల్లిటౌన్, మే 4: దేశవ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లు గెలుచుకోవడం ఖాయమని పీసీసీ మాజీ సభ్యులు ఈర్ల కొమురయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంటు స్థానం గెలుచుకుంటుందని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాజయ్య, మాటూరి రవి పాల్గొన్నారు.

'కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

కమాన్‌పూర్, మే 4: పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకుడు శ్రీనివాస్‌రాజ్ అన్నారు. శనివారం మండలంలోని జూలపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ హయాంలో సామాన్యుల నెత్తిన మోయలేని భారం మోపుతూ వచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరలు తగ్గుతాయన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైనాల రాజు, నాయకులు తిరుపతి, చొప్పరిశేఖర్, అబ్బెంగుల కొమురయ్య, జంగిలి కుమార్, ముత్యాలు యాదవ్ ఉన్నారు.

'కొప్పుల ఈశ్వర్ కార్మికులకు చేసిందేమీ లేదు'

గోదావరిఖని, మే 4: కొప్పుల ఈశ్వర్ కార్మికులకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్ అన్నారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికులను మోసం చేయడానికి కేసీఆర్ కుట్రలు పన్నుతున్నారన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వంద రోజుల్లో రామగుండం అభివృద్ధి కోసం రూ.400కోట్లను తీసుకు వచ్చారని అన్నారు. జూన్ మాసంలో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గట్ల రమేష్, కళ్యాణి సింహాచలం, గడ్డం శ్రీనివాస్, తాళ్లపల్లి యుగంధర్, ఇండ్ల ఓదెలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

రామగిరి, మే4: రామగిరి మండలంలోని రామయ్యపల్లి(బుధవారంపేట్) గ్రామంలో ఉపాధి కూలీలకు శనివారం ఎంపీపీ ఆరెల్లిదేవక్క మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాల్సిందిగా కూలీలను కోరారు. కార్యక్రమంలో తోటచంద్రయ్య, రోడ్డ బాపన్న, బర్లశ్రీనివాస్, గంటవెంకటరమణరెడ్డి, జాగరి రజిత, దాసరి శివ, రాయమల్లు, రజిత, శ్రీనివాస్, మల్లయ్య పాల్గోన్నారు.

చిరుతల రామాయణం ప్రదర్శన

జూలపల్లి, మే 4: మండలంలోని వడుకాపూర్‌లో శనివారం శ్రీరామచంద్రుని, హన్‌మాన్ భక్తులు కలిసి చిరుతల రామాయణం నాటక ప్రదర్శనను అత్యధిక భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మడి లక్ష్మన్, కటికిరెడ్డి సంపత్, రేవెల్లి బుచ్చయ్య, కనకట్ల రాజయ్య, కనకట్ల కనకయ్య, ఆకుల కుమార్, కనకట్ల లచ్చయ్య, రావుల మల్లేశం, రేవెల్లి రాజేశం, రంజిత్, నరేష్, పలువురు కళాకారులు భక్తులు పాల్గొన్నారు. కాగా, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై కళాకారులను అభినందించారు.

'దేశంలో నిర్బంధ పాలన'

కళ్యాణ్‌నగర్, మే 4: ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లుగా నిర్బంధ పాలన కొనసాగిస్తున్నారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పాపయ్య ఆరోపించారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా వర్గీకరణ చేయకుండా నరేంద్ర మోదీ చిచ్చు పెడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. 17పార్లమెంట్ స్థానాల్లో మాదిగలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తామని ఆయన అన్నారు. ప్రజల మధ్య కులాల చిచ్చు పెడుతూ రాముని పేరిట ఓట్లు దండుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకి తమ మద్దతు ఉంటుందని చెప్పారు. విలేకరుల సమావేశంలో కోండ్ర శంకర్, దుర్గా ప్రసాద్, మొండి, వేల్పుల మల్లేష్, రాజయ్య, లింగయ్య, సారమ్మ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

కమాన్‌పూర్, మే 4 : మండలంలోని సిద్దిపల్లి, బుర్రకాయపల్లి, శాలపల్లి, పెంచికలపేట, నాగారం గ్రామపంచాయతీల ఉపాధి హామీ కూలీలకు మహిళా సాధికారత కేంద్ర కోఆర్డినేటర్ దయా అరుణ, ఫైనాన్షియల్ లీటరిసి సంధ్యలు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. బేటి బచావో బేటి పడావో ముఖ్య ఉద్దేశ్యం, పోక్సో చట్టం, గృహ హింస చట్టం, హెల్ప్ లైన్ నెంబర్స్, సఖి కేంద్రం సేవలు, మహిళలకు లబ్ది చేకూర్చే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో శేషయ్య, పంచాయతీ కార్యదర్శి వికాస్‌కుమార్, సీనియర్ మేటు హరిష్ తదితరులు ఉన్నారు.